క్లుప్తంగా

ఘనంగా మహాలక్ష్మమ్మ జాతర



అప్పనపల్లిలో అమ్మవారి జాతరలో భాగంగా సిరిబొమ్మతో నృత్యం

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ దేవత కనక మహాలక్ష్మమ్మ జాతర సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ జాతర మహోత్సవాన్ని ఆద్యంతం కనుల పండువలా జరిపించారు. అమ్మవారికి మంగళవారం భక్తులు నైవేద్యాలు చెల్లించారు. బుధవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని, శుక్రవారం అన్న సమారాధన ఏర్పాటు చేశామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తులా నాగరాజు తెలిపారు. జాతర మహోత్సవం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు.

దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



అంబాజీపేట: నందంపూడి అమ్మవారితోటలో వేంచేసిన కనక దుర్గమ్మ ఆలయ 8వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి కుంకుమ పూజలతో పాటు అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు దాతల విరాళం



దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు మంగళవారం పలువురు దాతలు విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఈదర వీరవెంకటసత్యనారాయణ జ్ఞాపకార్థం అతని భార్య సరస్వతి, వారి కుమారుడు రాజేష్, వెంకటసుభాషిణి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం గునుపూడికి చెందిన గునుపూడి సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాలను ఆలయ అధికారులకు అందజేశారు. విరాళం అందించిన దాతలకు ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటాలు, ప్రసాదాలను అందజేశారు.

సమాజంలో మార్పునకు విద్య నాంది



నగరంలో సన్మానం అందుకున్న విద్యార్థులు

మామిడికుదురు: చదువు విద్యార్థి కుటుంబంలో వెలుగును నింపడంతో పాటు సమాజంలో మార్పుకు నాందిగా నిలుస్తుందని నేరేడుమిల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నేరేడుమిల్లి నిర్మలజ్యోతి పేర్కొన్నారు. నగరం గ్రామంలో మంగళవారం జరిగిన సమావేశంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన అదే గ్రామానికి చెందిన కొంబత్తుల కుషాల్, నీతిపూడి చంద్రకిశోర్, నేరేడుమిల్లి లాస్యలకు రూ.10 వేలు వంతున నగదు ప్రోత్సాహాలు అందించారు. వారిని ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. ఉప సర్పంచ్ అన్వర్ తాహిర్ హుస్సేన్, ట్రస్టు సభ్యులు నీతిపూడి సుజాత, మట్టా సునీల్‌కుమార్, కీర్తిబాబు, బళ్ల సత్యనారాయణ, బాలాజీ, వెంకన్నబాబు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు



ఎల్.శ్రీనునాయక్

ఆలమూరు: సోషల్ మీడియాలో ప్రేరేపితమైన రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగినా కొన్ని గ్రామాల్లో కొంతమంది వ్యక్తులు ప్రత్యర్థులను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తూ కవ్వింపు చర్యలకు దిగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మలుపు తెచ్చిన ముప్పు

- ఎస్–ఆకారంలో రోడ్డు
- తరచూ ప్రమాదాలు
- రోడ్డుకు ఒక వైపు చానల్, రెండో వైపు చెరువు



అంతర్వేదిపాలెం రోడ్డు మలుపు వెంబడి ఒక వైపు ఉన్న చాకలి చెరువు, మరో వైపు అంతర్వేది చానల్

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెంలో వైష్ణవ కొట్లుకు సమీపంలో 800 మీటర్ల మేర ఎస్ ఆకారంలో రెండు మలుపులతో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ రోడ్డు మలుపును ఆనుకుని ఒక వైపు చాకలి చెరువు, రెండో వైపు అంతర్వేది చానల్ ఉండడంతో వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు ఎడ్జి తక్కువగా ఉండడంతో తరుచూ ఈ ఏరియాలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా సందర్భాల్లో వాహనాలు అటు చెరువులోకి గాని, ఇటు పంటకాలువలో గాని దూసుకుపోతుండడం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. అయితే వాహనల్లోని వారు త్రుటిలో తప్పించుకుని ప్రాణాలతో బయటపడుతుండడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

అంతర్వేది పోవు మార్గంలో...

టేకిశెట్టిపాలెం మెయిన్ రోడ్డు నుంచి అంతర్వేది పుణ్యక్షేత్రానికి వెళ్లే అంతర్వేది రోడ్డుకు అంతర్వేది పాలెం లిమిట్స్‌లో ఈ ఎస్ ఆకారంలోని రోడ్డు ఉంది. రోడ్డుకు పూర్వం నుంచి ఒక వైపు చాకలి చెరువు, రెండో వైపు అంతర్వేది చానల్ ప్రవహిస్తోంది. ఈ రెండింటికీ మధ్య అంతర్వేది రోడ్డు వెళుతోంది. ఈ రోడ్డు మలుపులో ఏ వైపు నుంచైనా లోడ్, అన్‌లోడ్‌లతో వచ్చే వాహనాలు అదుపుతప్పిన సందర్భాల్లోను, ఎదురుగా వచ్చే వాటిని తప్పించుకునే సందర్భాల్లోను అటు చెరువులోకి, ఇటు పంటకాలువలోకి దూసుకుపోవడవం ఖాయమని జరిగిన సంఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి.

గతంలో రెండు ప్రమాదాలు..

గతంలో వాహనాలకు ఇక్కడ రెండు ప్రమాదాలు చోటు చేసుకుని త్రుటిలో డ్రైవర్, క్లీనర్‌లు ప్రాణాలతో బయటపడ్డారు. అదుపు తప్పిన క్రమంలో డ్రైవర్స్ చాకచక్యంతో వ్యవహరించడంతో ప్రమాదాలు త్రుటిలో తప్పుతున్నాయి. గ్రామంలోని వైష్ణవ కొట్లుకు సమీపంలోని మలుపు వద్ద ఉన్న చాకలి చెరువు వద్ద టేకిశెట్టిపాలెం వైపు నుంచి ఇటుకల లోడ్‌తో మోరి వైపునకు వెళుతున్న ట్రాక్టర్, ఎదురుగా బైక్ వస్తున్న యువకుణ్ణి తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి చాకలి చెరువులోకి తిరగబడింది. ఈ ఘటనలో డ్రైవర్ ప్రమాదం నుంచి బయట పడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే ఇక్కడ మలుపులో రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన అన్‌లోడ్ హెవీ ట్రక్ లారీ పంట కాలువలోకి దూసుకు వెళ్లింది. కేశవదాసుపాలెం నుంచి టేకిశెట్టిపాలెం వైపునకు వస్తున్న అన్‌లోడ్ ట్రక్ లారీ రోడ్డు ఎడ్జిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.



అంతర్వేదిపాలెంలో రోడ్డు మలుపులో అంతర్వేది చానల్‌లోకి దూసుకువెళ్లిన ట్రక్ లారీ(ఫైల్)

మలుపులో తరచూ ప్రమాదాలు



వైష్ణవ కొట్లు సమీపంలోని మలుపు రోడ్డులో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్డు 7 అడుగులు మేర వెడల్పు చేస్తామని గతంలో అధికారులు చెప్పారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను అధికారులు రూపకల్పన చేయాలి.

– గెద్దం బాలరాజు, శృంగవరప్పాడు

విస్తరణ పనులతో నివారణ



వైష్ణవ కొట్లు సమీపంలో ఎస్ ఆకారంలో ఉన్న రోడ్డుకు విస్తరణ పనులు చేపట్టడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు. ఇక్కడ మలుపులో ఓ వైపు చెరువు, మరోవైపు పంట కాలువతో రోడ్డుకు రెండు వైపులా ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

– తోటి జాన్ బాబు, అంతర్వేదిపాలెం

విస్తరణ చేయాల్సిన అవసరం ఉంది

వైష్ణవ కొట్లు సమీపంలో చెరువు, పంటకాలువ మధ్యగా వెళుతున్న రోడ్డు విస్తరణ చేయాల్సిన ఆవశ్యకత ఉంది. టేకిశెట్టిపాలెం నుంచి అంతర్వేది వరకూ ఉన్న ఈ రోడ్డుకు, శృంగవరప్పాడు నుంచి అంతర్వేది వరకూ విస్తరణ పనులు చేశాము. మున్ముందు శృంగవరప్పాడు నుంచి టేకిశెట్టిపాలెం వరకూ కూడా 3.4 కిలోమీటర్లు మేర రోడ్డు అభివృద్ధికి కృషి చేస్తాం.

– సురేష్, ఆర్అండ్‌బీ జేఈ, రాజోలు

కూడికలు.. తీసివేతల్లో నిమగ్నం..

- మండలాలు, గ్రామాల వారీగా లెక్కలు
- పెరిగిన పోలింగ్ శాతం
- ఓటింగ్ సరళిపై వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఆనందం



కొత్తపేట జెడ్పీ స్కూల్ పీఎస్‌లో సోమవారం రాత్రి ఓటు కోసం క్యూలో బారులు తీరిన ఓటర్లు

కొత్తపేట: అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ఓటరు తీర్పు స్ట్రాంగ్ రూములో భద్రంగా ఉంది. బూత్‌లు, గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ వ్యాప్తంగా ఏ స్థాయికి ఆ స్థాయిలో ఓటింగ్ సరళిపై ఆయా పార్టీల నాయకులతో పాటు రాజకీయ విశ్లేషకులు ఎవరికి వారు కూడికలు.. తీసివేతల్లో నిమగ్నమై లెక్కల్లో మునిగిపోయారు. ఏ బూత్‌లో ఎన్ని ఓట్లకు ఎన్ని పోలయ్యాయి.. ఆ బూత్‌లో ఏ ఏ సామాజిక వర్గాల వారు ఎంత మంది. వారి ఓట్లు ఎవరికి ఎన్ని.. అనే అంశాలపై ఆరాలు తీస్తున్నారు.

హమ్మయ్య.. ఓ పనైపోయింది..

అసెంబ్లీ, పార్లమెంట్ సాధారణ ఎన్నికలు నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచీ పార్టీ సమావేశాలు, నామినేషన్లు, ప్రచారాలు, సమీకరణల్లో నిమగ్నమై అవిశ్రాంతంగా కృషి చేసిన రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఆయా పార్టీల శ్రేణులు సోమవారం పోలింగ్ ముగియడంతో హమ్మయ్య.. ఓ పనైపోయింది.. అని ఎవరి ఇళ్లలో వారు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ ప్రధాన నాయకులతో గడుపుతున్నారు. కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్య వచ్చే ఫోన్ కాల్స్ మాట్లాడుకుంటూ, ఓటింగ్ సరళిపై సమీక్షలు చేస్తూ సేద తీరుతున్నారు. ప్రజా తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉండగా ఎవరికి వారు మంచి మెజార్టీతో విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్నారు. అయితే అధికార పార్టీ ప్రజా సంక్షేమ పథకాల ప్రభావం గాలి బాగా వీచిందని, ఆ పార్టీకే గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు.

ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం, ముఖ్యంగా పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి నియోజకవర్గ ఎన్నికల అధికారి, స్థానిక ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బంది కొత్త ఓటర్లు నమోదు, ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన, పోలింగ్ నిర్వహణపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు వివిధ దశల్లో శిక్షణ కార్యక్రమాలతో అవిశ్రాంతంగా శ్రమించారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ ముగించుకుని, ఈవీఎంలను స్ట్రాంగ్ రూముల్లో అప్పగించి సోమవారం అర్ధరాత్రికి తమ ఇళ్లకు చేరుకున్నారు. అలాగే గత ఎన్నికల్లో అవాంఛనీయ, చెదురుమదురు సంఘటనలను దృష్టిలో పెట్టుకుని డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఎక్కడా ఏ విధమైన శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

కొత్తపేట నియోజకవర్గంలో 85.18 శాతం పోలింగ్

కొత్తపేట నియోజకవర్గంలో 2,52,383 మంది ఓటర్లు కాగా వారిలో స్త్రీలు 1,27,324 మంది, పురుషులు 1,25,053 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. కాగా సోమవారం పోలింగ్‌లో మొత్తం 2,14,975 (85.18 శాతం) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో మహిళలు 1,07,210 మంది, 1,07,762 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. గత ఎన్నికల పోలింగ్ సరళి పరిశీలిస్తే ప్రతి ఎన్నికకు పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. ఆ విధంగా 2014 ఎన్నికల్లో మొత్తం 2,23,296 ఓట్లకు 1,87,436 ఓట్లు పోలయ్యాయి. అంటే 83.94 శాతం ఓట్లు పోలయ్యాయి. 2019 ఎన్నికల నాటికి 18,259 మంది ఓటర్లు పెరగ్గా మొత్తం ఓటర్ల సంఖ్య 2,41,555 మందికి పెరిగింది. వారిలో 2,03,639 మంది అంటే 84.30 శాతం ఓట్లు పోలయ్యాయి. 2014 ఎన్నికలతో పోలిస్తే 2019 లో 0.36 శాతం ఓట్లు ఎక్కువ పోలయ్యాయి. ఈసారి 10,828 మంది కొత్త ఓటర్లు చేరగా మొత్తం ఓటర్ల సంఖ్య 2,52,383 మందికి పెరిగింది. వారిలో 2,14,975 మంది అంటే 85.18 శాతం ఓట్లు పోలయ్యాయి. 0.88 శాతం ఓట్లు ఎక్కువ పోలయ్యాయి.

పి.గన్నవరం నియోజకవర్గంలో 83.46 శాతం

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గంలో 83.46 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఓటర్లు బారులు తీరి ఓటు వేశారు. పి.గన్నవరం నియోజకవర్గంలో మొత్తం 1,98,602 మంది ఓటర్లకు గాను 1,65,749 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 99,943 మందికి 84,467 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 98,653 మంది మహిళలకు గాను 81,279 మంది ఓట్లు వేశారు. ఇతరులు ఆరుగురికి గాను ముగ్గురు ఓట్లు వేశారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు, మొసలపల్లి, వ్యాఘ్రేశ్వరం, చినలంక గ్రామాల్లో రాత్రి తొమ్మిది గంటల వరకు పోలింగ్ జరిగింది. అయినవిల్లి మండలం చింతనలంక, శానపల్లిలంక, పొట్టిలంక, సిరిపల్లి సుమారు తొమ్మిది గంటల వరకు పోలింగ్ జరిగింది. మామిడికుదురు, పి.గన్నవరం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో 8 గంటల వరకు పోలింగ్ జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంతో ఉత్సాహంగా ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. 2019 ఎన్నికల్లో 78.60 శాతం పోలింగ్ జరిగింది. కాగా గత ఎన్నికల కన్న ప్రస్తుత ఎన్నికల్లో 4.86 శాతం అదనపు పోలింగ్ నమోదైంది.

రాజోలు నియోజకవర్గంలో 78.40 శాతం

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్ 78.40 శాతంగా నమోదైంది. మొత్తం ఓటర్లు 1,97,920 కాగా వీరిలో మొత్తం పురుషులు 97,807, స్త్రీలు 1,00,112 ఉన్నారు. మొత్తం ఓటర్లలో 1,55,170 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో 76,698 మంది పురుషులు, 78,471 మంది స్త్రీలు, ట్రాన్స్‌జెండర్ ఒకరు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

జాషువాకు ఘన నివాళి



కొల్లాబత్తుల జాషువా చిత్రపటం వద్ద నివాళలర్పిస్తున్న ప్రముఖులు

సఖినేటిపల్లి: రామేశ్వరానికి చెందిన నియోజకవర్గ గోదావరి కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి, కళా కోవిదుడు డాక్టర్ కొల్లాబత్తుల జాషువాకు పలువురు ఘన నివాళులర్పించారు. మంగళవారం రామేశ్వరంలో ఈ మేరకు ఆయన చిత్రపటం వద్ద శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, సింధు కె ప్రసాద్, శ్యాంసన్, పి.శేఖర్, నల్లి నిర్మల్ కుమార్, నల్లి చిట్టిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో వక్తలు మాట్లాడుతూ, జాషువా మృతి కళా రంగానికి తీరని లోటు అని అన్నారు. మిమిక్రీ ఆర్టిస్ట్‌గా ఆయన మంచి గుర్తింపు వచ్చిందన్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సమాఖ్య అధ్యక్షుడు దుర్గాప్రసాద్

మామిడికుదురు: అప్పనపల్లిలో సిక్స్ ఎ సైడ్ క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను గ్రామ ప్రముఖులు గెద్దం వెంకటేశ్వరరావు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ పోటీల్లో విన్నర్‌కు రూ.16 వేలు, రన్నర్‌కు రూ.13 వేలు నగదు ప్రోత్సాహాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. పలు జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. నయినాల కాశీ, రాజ్ కిష్వర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.10,101 విరాళం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన ట్రస్టు కోసం గ్రామానికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసరావు, అనంతలక్ష్మి దంపతులు రూ.10,101 విరాళం ఇచ్చారు. సదరు మొత్తాన్ని ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం ఇచ్చి సత్కరించారు.

తాటిముంజెలా మజాకా?

అంబాజీపేట: వేసవి తాపాన్ని నివారించే తాటి ముంజెలకు మంచి గిరాకీ ఉంది. డిమాండ్ ఉన్న ఈ తాటి ముంజెలు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. పల్లెల్లో తాటి చెట్లను ఇబ్బిడి ముబ్బిడిగా నరికివేస్తుండడంతో తాటి ముంజెలకు తీవ్ర కొరత ఏర్పడింది. వేసవి తాపాన్ని తట్టుకోవడంతో పాటు మంచి పోషకల విలువలు ఉన్న తాటి ముంజెలు రైతులు, యువకులకు లాభసాటి వ్యాపారంగా మారింది. ఏప్రిల్ నుంచి జూన్ మొదటి వరకు పల్లెల్లోని తాటి ముంజెలను తీసి వాటిని దూరంగా పట్టణాలు, నగరాలకు తీసువెళ్లి అమ్ముతున్నారు. ఒక్కో యువకుడు తన బైక్‌పై రూ.3,500 విలువైన ముంజెలను తీసుకుని వెళ్లి మధ్యాహ్నానికి విక్రయించి ఇళ్లకు చేరుతున్నామని ఎం.రాములయ్య తెలిపారు. డజను తాటి ముంజెలు రూ.25లు పలుకుతుంది. రవాణాచార్జీలు, తాటి ముంజెలు తీసుకునేందుకు ఖర్చులు పోగా రోజుకు రూ.1,000 వరకు సంపాదిస్తున్నామని యువకులు తెలిపారు.

వేసవిలో ముంజెలతో మేలు



వేసవి కాలంలో దొరికే ముంజెలు తినడం వల్ల దాహార్తిని అరికట్టడమే కాకుండా అనేక పోషకాలు అందుతాయి. వంద గ్రాముల ముంజెలను తినడం వల్ల తాపం తగ్గటమే కాకుండా 28.9 కిలో కేలరీల శక్తి లభిస్తుంది. అందుకే వేసవిలో కొబ్బరి బొండాలతో పాటు తాటి ముంజెలను తీసుకోవడం వల్ల శరీరం నుంచి పోతున్న అన్ని రకాల పోషకాలు తిరిగి లభ్యమవుతాయి.

– వి.గౌతమి, పీహెచ్‌సీ వైద్యాధికారి, అంబాజీపేట

పోషకవిలువలు ఎన్నో

తాడిచెట్టును ఇంగ్లీష్‌లో పల్మేలెట్రి అని శాస్త్రీయంగా బోరాసస్ ఫ్లాబెలీఫెర్ అని పిలుస్తారు. తాడిచెట్టులో అన్ని భాగాలు ఉపయోగపడతాయి. వీటి నుండి తీసే ముంజెలను వేసవి తాపం తీర్చేందుకు విరివిగా ఉపయోగిస్తున్నారు. 100 గ్రాముల ముంజెలను తీసుకుంటే వాటిలో 92.5 గ్రాముల తేమ, 0.6 గ్రాముల ప్రొటీన్లు, 0.1 గ్రాముల కొవ్వు, 0.2 గ్రాముల బూడిద, 0.2 గ్రాముల పీచుపదార్థాలు, 6.4 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 12 మిల్లీగ్రాముల కాల్షియం, 21 మిల్లీ గ్రాముల పాస్ఫరస్, 0.3 మిల్లీ గ్రాముల ఇనుప ధాతువు, 61 మిల్లీ గ్రాముల ఆస్కార్బిక్ ఆమ్లం ఉంటాయని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు.



తాటికాయల నుంచి తీసిన ముంజెలు

విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండాలి



హరినాథ్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకుంటేనే తమకు ఆనందంగా ఉంటుందని పెదపట్నంలంక జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం కె.హరినాథ్ పేర్కొన్నారు. మగటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేస్తూ తమకు విద్య నందించిన హరినాథ్‌కు మగటపల్లి, గోగన్నమఠం, పొన్నమండ గ్రామాలకు చెందిన 2010–11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం సన్మానం చేశారు. హరినాథ్‌కు ప్రశంసాపత్రం అందించి శాలువాలతో సత్కరించారు. ఆయన ఎంతో కష్టపడి తమకు విద్య నేర్పించారని, ఆయన చెప్పిన పాఠాలు చదువుకుని తాము ఉన్నత స్థానాలకు చేరుకున్నామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మూడు గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి



రాజోలు విద్యుత్‌శాఖ ఏడీఈకి వినతిపత్రం అందిస్తున్న కాలనీ వాసులు

రాజోలు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సోంపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి వీధి నివాసితులు విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. లోఓల్టేజీ సమస్యతో చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఆంజనేయస్వామి వీధి నివాసితులు బొమ్మిడి వెంకటేష్, తిరుమాని రాజు, బొమ్మిడి భరణికుమార్, నందకిషోర్, సంకరపు పెద్దిరాజు, ఇల్లింగి పెద్దిరాజు తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు.

ఉచిత వైద్య సేవలు



నగరంలో వైద్య సేవలందిస్తున్న స్వర్ణలత

మామిడికుదురు: నగరం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత ఆధ్వర్యంలో సుమారు 346 మందికి ఉచితంగా వైద్య సేవలందించి, మందులు అందజేశారు. వేసవి కాలంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం.ఏడుకొండలు, ఏఎన్ఎంలు ఎం.సునీత, కె.చంద్రకుమారి, పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

అయినవిల్లి: ఎస్.పెదపాలెం గ్రామదేవతగా పూజలందుకుంటున్న ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా జరిపారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలు నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు.